క్లుప్తంగా

రైల్వే గేటు మూసివేత

మాక్లూర్: రైల్వే గేటు మరమ్మతుల కారణంగా మండలంలోని అడవిమామిడిపల్లి రైల్వే గేటును బుధవారం రాత్రి 9 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మూసి వేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు బుధవారం తెలిపారు. ఆ రహదారి గుండా ప్రయాణం సాగించే వాహనదారులు గమనించాలన్నారు.

రేపు డొంకేశ్వర్ వారసంత వేలం పాట

డొంకేశ్వర్(ఆర్మూర్): 2025–26 సంవత్సరానికి డొంకేశ్వర్ వారసంత వేలం పాటను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శేఖర్‌గౌడ్ బుధవారం తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చేయాలని, గతంలో బకాయిలున్న వారు వేలం పాటకు అనర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు పంచాయతీ కార్యాలయానికి రావాలని సూచించారు.

రెండోసారి తైబజార్ వేలం పాట వాయిదా

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన తైబజార్ వేలం పాట రెండోసారి వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. వేలం పాటలో ఎవరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేశారు. ఆసక్తిగలవారు మున్సిపల్ కమిషనర్ పేరు మీద డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తైబజార్ వేలం పాటు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో ఎస్సీ మాల సంఘ భవన నిర్మాణం కోసం ఎంపీ అర్వింద్ మంజూరు చేసిన రూ.3.5 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని బుధవారం సంఘ సభ్యులకు బీజేపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీకి, బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీజ్ చేసిన భూమికి ఎల్ఆర్ఎస్ తీసుకోవద్దు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం సర్వే నంబరు–390/3లో సీజ్ చేసిన భూమికి ఎల్ఆర్ఎస్ తీసుకోవద్దని స్థానిక యువకుడు దాసరి నరేశ్ తహసీల్దార్ గజానాన్‌ను కోరారు. బుధవారం ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వాసుపత్రికి ఈ స్థలం కేటాయించాలని కోరారు.

హోటళ్లు, దుకాణాలలో తనిఖీలు



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్ ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, చికెన్, మటన్ దుకాణాలలో మున్సిపల్ సానిటరి ఎస్సై గజానంద్ తనిఖీలు చేపట్టారు. పలువురికి జరిమానా విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది అక్షయ్, ప్రశాంత్, రవి పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా బొర్రోళ్ల సురేశ్



నందిపేట్ (ఆర్మూర్): బీఎస్పీ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నందిపేట మండల కేంద్రానికి చెందిన బొర్రోళ్ల సురేశ్‌ను నియమించారు. ఈ మేరకు సెంట్రల్ కో–ఆర్డినేటర్ నిషాని రామచంద్రం, స్టేట్ కార్యదర్శి గైని గంగాధర్, జిల్లా అధ్యక్షులు సింగడే పాండు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేస్తూ.. అందరి సమస్యల మీద పోరాటం చేస్తానని అన్నారు.

పశువైద్య శిబిరం



వేల్పూర్: వేల్పూర్ ఏఎంసీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపల్లి(కే)లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్లు గౌరాయి నరేందర్, బొంబాయి గంగాధర్, మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన అండర్ వే బ్రిడ్జి నిర్మాణం

- ముప్కాల్ మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్ వద్ద పనులు
- కొత్తపల్లి రోడ్డు నుంచి ట్రాఫిక్ మళ్లింపు



అండర్ వే బ్రిడ్జి కోసం చేపడుతున్న తవ్వకాలు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి–44 బైపాస్ వద్ద అండర్ వే బ్రిడ్జి నిర్మాణ పనులు జోరందున్నాయి. జాతీయ రహదారి జంక్షన్ వద్ద అండర్ వే బ్రిడ్జి లేకపోవడంతో తరుచుగా ప్రమాదాలు జరిగేవి. దీంతో ఆరు నెలల క్రితం అండర్ వే బ్రిడ్జి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి బ్రిడ్జి నిర్మాణ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్లు, మురికి కాలువల పనులను చేపట్టారు. 10 రోజుల నుంచి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మట్టి తవ్వకాల పనులు, సైడ్ వాల్ స్టీలు పనులు సాగుతున్నాయి. పనులను మరింత వేగవంతం చేసి వేసవి కాలం పూర్తయ్యే లోపు పనులను పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అండర్ వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మెండోరా మండల కేంద్రానికి, ముప్కాల్ మండలంలోని పలు గ్రామాల ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణం సాగుతుంది.

జాతీయ రహదారి జంక్షన్ నుంచి ముప్కాల్ మండల కేంద్రం లోపలికి వెళ్లకుండా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. మండలంలోని కొత్తపల్లి శివారున గల సర్వీస్ రోడ్డు నుంచి ముప్కాల్ మండల కేంద్రం లోపలికి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. నిర్మల్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ప్రయివేటు వాహనాలు ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగానే ఉంటుంది. పనులు పూర్తయ్యే వరకు ఇబ్బందులు తప్పేలా లేవని అధికారులు అంటున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

అండర్ వే బ్రిడ్జి పనులను వేగంగా చేపట్టాలి. పనులు చేపటుతుండటంతో ట్రాఫిక్ మళ్లిస్తున్నారు. దీంతో మండల కేంద్రంలోకి బైక్‌లపై వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. – రమేశ్, ఉపాధ్యాయుడు, ముప్కాల్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చిన్నమావందిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బోధన్ సొసైటీ చైర్మన్ లక్ష్మణ్

బోధన్: చిన్నమావందిలో బుధవారం మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని బోధన్ సొసైటీ చైర్మన్ ఉద్మీర్ లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సన్‌ఫ్లవర్ క్వింటాలు మద్దతు ధర రూ.7,280 చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. వైస్ చైర్మన్ వీరభద్రరావు, డైరెక్టర్లు పోశెట్టి, భాస్కర్, గ్రామ రైతులు పోతారెడ్డి, లక్ష్మయ్య, నాగుపటేల్, మోహన్ పటేల్, సీఈవో ఉమాకాంత్ పాల్గొన్నారు.



జైతాపూర్‌లో .. తహసీల్దార్ ధన్వాల్

జైతాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం..

ఎడపల్లి(బోధన్): జైతాపూర్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ధన్వాల్, విండో చైర్మన్ కంటే సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఏవో సిద్ధిరామేశ్వర్, సుభాష్ పాల్గొన్నారు

తగిలేపల్లిలో..

వర్ని: తగిలేపల్లిలో రుద్రూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి ప్రారంభించారు. రుద్రూర్ సొసైటీ చైర్మన్ సంజీవరెడ్డి, వైస్ చైర్మన్ తొంట శంకర్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాల అందజేత



విరాళం అందజేస్తున్న దాతలు

రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ రామ మందిరం పునర్నిర్మాణానికి దాతల నుంచి మంచి స్పందన లభిస్తుంది. బుధవారం పలువురు దాతలు స్వచ్ఛందంగా ఆలయ నిర్మాణానికి చందాలు అందజేశారు. జక్కుపోశెట్టి నారాయణ రూ.21,111, జక్కు పోశెట్టి సుధాకర్ రూ.18,888, వంజరి సంజీవన్(రాకేష్) రూ.9,999, పుట్టి భూమయ్య రూ.6,666, వంజరి ఆమండ్ వెంకటేష్ రూ.5,555, వంజరి ఆమండ్ గణేష్ రూ.5,555, కుర్లెమ్ వీరేందర్ రూ.5,555, రావుట్ల అశోక్ రూ.2,116, గైని సంతోష్ రూ.1,116, కాసుల సాయిలు రూ.1,000 చందాను అందజేశారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు..

వేల్పూర్: సాహెబ్‌పేట్ గ్రామానికి చెందిన పిప్పెర శృతి రమేశ్ కుటుంబానికి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రూ.2 లక్షల పీఎంజేజేబీవై బీమా చెక్కును బ్యాంకు మేనేజరు శివకాంత్ బుధవారం అందజేశారు. శృతి అత్త పిప్పెర చిన్నముత్తెమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. ఆమె ఎస్‌బీఐ ఖాతాదారు కావడంతో ఇన్సూరెన్స్‌ను క్లెయిమ్ చేసి నామినీగా ఉన్న కోడలు శృతికి అందజేశారు.

ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ

ఆర్మూర్‌టౌన్/బోధన్‌టౌన్(బోధన్): ఆస్తి పన్ను చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ చేస్తోందని ఈ అవకాశాన్ని బోధన్, ఆర్మూర్ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు వెంకట నారాయణ, రాజు వేర్వేరుగా కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన చేశారు. ప్రజలు ఈ నెల 31లోపు ఆస్తిపన్నులు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నందిపేట్(ఆర్మూర్): జాతీయ ఫైలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం నందిపేట్ మండల కేంద్రంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రాజనగర్, హనుమాన్ గల్లీ, గ్రామపంచాయతీ వినాయక్ నగర్, ఐలమ్మ విగ్రహం ప్రాంతాలలో నాలుగు బృందాలుగా ఏర్పడి రక్త నమూనాలను సేకరించారు. డాక్టర్ ప్రవీణ్, హెల్త్ సూపర్‌వైజర్లు సురేందర్, భాస్కర్, ల్యాబ్ టెక్నీషియన్ భూమేశ్వర్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ మండలం మోతెలో..

వేల్పూర్: మోతె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు బోధకాలు(ఫైలేరియా) వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వేలో భాగంగా రాత్రి 8:30 గంటల నుంచి 11 వరకు ఇంటింటికి తిరిగి 231 మంది రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమాన్ని జిల్లా మలేరియా నివారణ అధికారి తుకారాం రాథోడ్ పర్యవేక్షించారు. మోతె పీహెచ్‌సీ వైద్యులు శరత్‌చంద్ర, సబ్‌యూనిట్ అధికారి సాయి, సీహెచ్‌వో నారాయణ, సూపర్‌వైజర్ తబిత, హెల్త్ అసిస్టెంట్ వేణు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న మీ–సేవ పోర్టల్

- ధ్రువపత్రాల జారీలో ఆలస్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ఆర్మూర్ టౌన్: ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా రుణాలు అందిస్తున్న నేపథ్యంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో మీ–సేవ పోర్టల్ నెమ్మదిగా పనిచేయడం.. అధికారుల వెరిఫికేషన్ ఆలస్యం కావడం వల్ల పత్రాలు తొందరగా అందడం లేదు. కొంతమంది దరఖాస్తు చేసుకుని వారం రోజులు గడిచినా ధ్రువీకరణ పత్రాలు అందలేదు. రాజీవ్ యువ వికాస్ పథకం రుణ దరఖాస్తు గడువు వచ్చే నెల 4వ తేదీ కావడంతో ప్రజలు వీటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం తహసీల్ కార్యాలయంలో కుల, ఆదాయ, రెసిడెన్షియల్‌తో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు సుమారు 4వేలకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి. పత్రాల మంజూరులో ఆలస్యంపై స్థానిక తహసీల్దార్‌ను వివరణ కోరగా.. మీ–సేవ పోర్టల్ నెమ్మదిగా ఉండటంతో ధ్రువీకరణ పత్రాల జారీ ఆలస్యమవుతోందని సమాధానమిచ్చారు. రోజుకు దాదాపు వెయ్యి దరఖాస్తులు వస్తున్నాయని, త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'గంగా కావేరి'కి బోనస్ ఇవ్వాలి



జాకోరాలో ఆదాయవ్యయాలను వినిపిస్తున్న సీఈవో రామకృష్ణయ్య

వర్ని: రైతులు పండించిన గంగా కావేరి వరి రకానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలని జాకోరా సహకార సంఘం మహాజన సభలో సభ్యులు తీర్మానం చేశారు. బుధవారం జాకోరా సహకార సంఘం మహాజన సభ అధ్యక్షుడు దశరథ్ అధ్యక్షతన నిర్వహించారు. 2024 –2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లావాదేవీలను సంఘం సీఈవో రామకృష్ణయ్య సభ్యులకు తెలియజేశారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

రెంజల్(బోధన్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని రైతులు తీర్మానాలు చేశారు. బుధవారం రెంజల్, నీలా సొసైటీ మహాజన సభలను చైర్మన్ల అధ్యక్షతన నిర్వహించారు. రైతులు చేసిన తీర్మానాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని రకాల వడ్లకు ప్రభుత్వం బోనస్ చెల్లించాలని, గత సీజన్‌లో నీలాలో కొందరు రైతులకు బోనస్ అందలేదని పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్లు మొయినోద్దీన్, ఇమాంబేగ్, మాజీ చైర్మన్ ఆసాని ప్రశాంత్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



రెంజల్ మహాజన సభలో.. సీఈవో ఇంద్రసేన్

జానకంపేట సింగిల్ విండో మహాజనసభ



జానకంపేటలో మాట్లాడుతున్న చైర్మన్ నరేందర్

ఎడపల్లి(బోధన్): జానకంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం విండో అధ్యక్షుడు మిద్దె నరేందర్ అధ్యక్షతన మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను చేశారు. సంఘం ఆదాయ వ్యయాలను సొసైటీ కార్యదర్శి గంగారెడ్డి చదివి వినిపించారు. ఈ మహాజన సభలో పలు తీర్మానాలు చేశారు.

ఆర్మూర్‌లో ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ మార్కెట్ యార్డులో బుధవారం ప్రభుత్వ అధికారంగా ఇఫ్తార్ విందు నిర్వహించింది. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పొతంగల్ మాల సంఘం మండల కమిటీ

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలో బుధవారం బాన్సువాడ డివిజన్ మాల సంఘం అధ్యక్షులు మిర్జాపురం సాయన్న ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జ్యోతి పాల్, గౌరవ అధ్యక్షుడిగా నిమ్మల దిగంబర్, ఉపాధ్యక్షుడిగా వ్యాపారి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కాలే సాయిలు, సహాయ కార్యదర్శిగా సోంపుర్ రాజేందర్, బేగరి కృష్ణ, యువజన విభాగం అధ్యక్షులుగా సాన్‌కాంబ్లె యాదు, సోషల్ మీడియా అధ్యక్షులుగా భీమ్‌రావు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ట్రాన్స్‌కో అధికారుల పొలం బాట

బాల్కొండ: నాగాపూర్‌లో బుధవారం ట్రాన్స్‌కో అధికారులు పొలం బాట నిర్వహించారు. ఈసందర్భంగా పంట భూముల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టారు. డీఈఈ రాజేశ్వర్, ఏడీ శ్రీనివాస్, ఏఈ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

మాక్లూర్: గొట్టిముక్కుల గ్రామ రామాలయ ప్రహరీ నిర్మాణానికి బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్, మాజీ చైర్మన్ బి.దయాకర్ రావు, మాక్లూర్ మాజీ సర్పంచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. పది మంది అరెస్ట్

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని పొట్టిగుట్ట శివారులో పేకాట స్థావరంపై బుధవారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి పది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.83,130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వర్ని ఎస్సై మహేష్ తెలిపారు.

జీపీ భవనం పూర్తి.. కార్యకలాపాలెప్పుడో?



పూర్తయిన నెహ్రూనగర్ కాలనీ జీపీ భవనం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కూడలి వద్ద గల నెహ్రూనగర్ కాలనీ గ్రామ పంచాయతీ భవన నిర్మాణం ఎట్టకేలకు రెండేళ్లకు పూర్తయింది. గత ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా నెహ్రూనగర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం 2023లో ఉపాధిహామీ పథకం నిధులు రూ. 20 లక్షలు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన తరువాత ఆగుతూ.. సాగుతూ జరిగాయి. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. నూతన పంచాయతీ పాలక వర్గం ఏర్పడిన తర్వాత ప్రారంభిస్తారా లేక.. ఇప్పుడే ప్రారంభిస్తారో తెలియాల్సి ఉంది. అక్కడక్కడ స్వల్ప మరమ్మతులు ఉన్నాయని, వాటిని పూర్తి చేసి త్వరలోనే అధికారులకు పంచాయతీ భవనాన్ని అప్పగిస్తామని పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ షరీఫ్ తెలిపారు.

సుపరిపాలన అందించడానికే పాదయాత్ర



మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమ సన్నహాక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బాపుజీ కలలు కన్నా రాజ్యాన్ని తిరిగి సాధించడానికి పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధికార ప్రతినిధి శేఖర్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ ప్రగతి ప్రజలకు తెలియజేయాలి'

పెర్కిట్(ఆర్మూర్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్మూర్ మండలం పిప్రితో పాటు ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఆర్మూర్, ఆలూర్ మండలాల అధ్యక్షులు చిన్నారెడ్డి, ముక్కెర విజయ్, నేతలు మునిపల్లి సాయారెడ్డి, సుర్బిర్యాల్ జీవన్ రెడ్డి, మంథని శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్త్రీనిధిలో జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఆర్‌డీవో సాయాగౌడ్



ఆర్మూర్ ఏపీఎం గంగారాం, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్పందన

డొంకేశ్వర్(ఆర్మూర్): 2023–24 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల సభ్యులకు లక్ష్యానికనుగుణంగా రుణాలు అందజేసినందుకు రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఉత్తమ అవార్డు లభించింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్‌డీవో సాయాగౌడ్ ఈ అవార్డును అందుకున్నారు. 2023–24 సంవత్సరంలో రూ.185.24 కోట్ల లక్ష్యానికి గాను రూ.186.17కోట్లు రుణాలు అందజేశారు. అలాగే 92 శాతం రికవరీ ఉండటంతో రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చింది. సిబ్బంది కృషితోనే ప్రతి ఏడాది అవార్డు లభిస్తోందని డీఆర్‌డీవో సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్మూర్ మండల సమాఖ్యకు ప్రథమ అవార్డు

పెర్కిట్(ఆర్మూర్): లక్ష్యానికనుగుణంగా రుణాలు అందజేసినందుకు ఆర్మూర్ మండల సమాఖ్యకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో ఈ అవార్డును ఆర్మూర్ ఏపీఎం గంగారాం, ఆర్మూర్ మండల సమాఖ్య అధ్యక్షురాలు స్పందన అందుకున్నారు.

రాష్ట్రస్థాయి సదస్సుకు కుకునూర్ రైతు



మాట్లాడుతున్న కుకునూర్ రైతు ర్యాడ నర్సయ్య

వేల్పూర్: ఎరువుల సంస్థ ఇఫ్కో.. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అడ్వైజరీ సమావేశంలో వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన రైతు ర్యాడ నర్సయ్య పాల్గొని ప్రసంగించారు. నానో టెక్నాలజి ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ సదస్సుకు ఇఫ్కో సంస్థ రాష్ట్ర స్థాయిలో ముగ్గురు రైతులను ఆహ్వానించగా అందులో ర్యాడ నర్సయ్య ఒకరు. నానో యూరియా, డీఏపీ వాడకం వల్ల కలిగే లాభాల గురించి సదస్సులో వివరించినట్లు నర్సయ్య పేర్కొన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల ఏవిధంగా నష్టపోతున్నామో వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మారగంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇఫ్కో సంస్థ మేనేజరు శివరామకృష్ణ, ఇఫ్కో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

బోధన్: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం సబ్సిడీపై అందించనున్న వివిధ వ్యవసాయ పరికరాలు పొందేందుకు సాలూర మండల మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్వేత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం, సాధారణ సామాజిక వర్గాల వారికి 40 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సన్న, చిన్నకారు మహిళా రైతులకు ఈ పథకంలో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 29వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని వెల్లడించారు.

నేడు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఏమైనా సమస్యలుంటే పుర ప్రజలు మున్సిపల్ కమిషనర్ రాజుతో మాట్లాడొచ్చు.

తేది : 27-03-2025 (గురువారం)

సమయం : ఉదయం 11.00 నుంచి 12.00 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: **98499 04276**



సినిమాలు

వీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 ఓ అందాల రాక్షసి 11.00, కిస్ కిస్ కిస్సిక్ 1.45, 7.35, అల్లర్ట్ 4.35, 10.25
- స్క్రీన్-2 ఛావా10.00, 4.00, 10.00 షణ్ముఖ 1.20, 7.20
- స్క్రీన్-3 సలార్–పార్ట్–1 10.00, 4.05, 10.10 పెళ్లికాని ప్రసాద్ 1.30, 7.35
- స్క్రీన్-4 కోర్ట్ 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,500	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,527		

– నిజామాబాద్ బిజినెస్